
సాక్షి
పల్నాడు
సోమవారం । 28 । ఆగస్టు । 2023



పవర్‌లిఫ్టర్ జ్ఞానదివ్యకు సన్మానం

తెనాలిఅర్బన్: అఖిల భారత ఎన్జీఓ సంక్షేమ సంఘం, కేబీఆర్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్యను ఆదివారం గుంటూరులో సన్మానించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 4,513 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2,040 క్యూసెక్కులు వదిలారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు



పాలువాయి(రెంటచింతల):పాలువాయి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి కొలుపులలో భాగంగా ఆదివారం అమ్మకు పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాలరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమరేశ్వరాలయంలో జస్టిస్ వేణుగోపాలరావుకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మకు కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు జస్టిస్ వేణుగోపాలరావుకు స్వామి శేష వస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి 4.50 కేజీల వెండి చీర



చీరాల అర్బన్: పట్టణంలోని కుందేరు రోడ్డులో వేంచేసి యున్న రాజరాజేశ్వరి మందిరంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన 4.50 కేజీల వెండి చీరను ఉభయదాతల ఇంటి వద్ద నుంచి మేళతాళాలతో పట్టణంలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి వెండి చీరను సంప్రోక్షణ చేసి అమ్మవారికి అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమాన్ని మందిర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేటి నుంచి డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 1 వరకు గడువు



గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సోమవారం నుంచి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈమేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలు చేపడుతున్నారు. మొదటి విడత ప్రవేశాల ప్రక్రియలో దరఖాస్తు చేసుకోని విద్యార్థులతోపాటు కేటాయించిన కళాశాలలో చేరని, ఇతర కళాశాలలకు వెళ్లేందుకు సిద్ధమైన విద్యార్థులు సోమవారం నుంచి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఏపీ ఓఏఎండీసీ-2023-24) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు అదే సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. సెప్టెంబర్ 12న రెండో విడతలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరగనుంది.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విజయవాడ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. విజయవాడ దేవీనగర్‌కు చెందిన ఎన్.గోపాల శెట్టి, లక్ష్మి తమ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ధర్మ ప్రభూత్వం

- గ్రామ కంఠ వాసులకు హక్కుపత్రాల జారీకి చర్యలు
- వందేళ్లుగా ఏ ప్రభుత్వం చేయని మేలు
- గ్రామ కంఠాల సర్వే చేపట్టిన పంచాయతీ అధికారులు
- పైలెట్ ప్రాజెక్టుగా 4 గ్రామాల్లో పూర్తి
- మరో 31 గ్రామాల్లోనూ చకచక సర్వే



వట్టిచెరుకూరు మండలంలో సర్వే సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఓ కేశవరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నో దశాబ్దాలుగా గ్రామకంఠం భూముల్లో ఉంటున్న వారికి త్వరలో ప్రభుత్వం భూ హక్కు పత్రాలు ఇవ్వనుంది. దీనికోసం రీసర్వే చేపట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే గుంటూరు జిల్లాలో మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు గ్రామాల్లో సర్వే పూర్తి చేసింది. రెండో దశలో మరో 31 గ్రామాల్లో ఈ సర్వే జరుగుతోంది.

కేంద్ర ప్రభుత్వమూ గ్రీన్‌సిగ్నల్

వందేళ్లకుపైగా గ్రామకంఠం భూములు ఎటువంటి సర్వేకు నోచుకోలేదు. ప్రభుత్వ రికార్డుల్లో అసైన్డ్‌గా ఉండడంతో ఈ భూముల్లో నివాసం ఉంటున్న పేదలు ఏ హక్కులూ లేకుండా ఉన్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్లు, లావాదేవీలు జరిపే అవకాశం లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం స్వమిత్వ పథకం ద్వారా గ్రామకంఠం భూముల సర్వేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వమూ వైఎస్సార్ జగనన్న భూ హక్కు, భూరక్ష పథకంలో భాగంగా వీటిని చేర్చింది. దీంతో గుంటూరు జిల్లాలో ముందుగా నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా సర్వే చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం మరో 31 గ్రామాల్లో సర్వే మొదలు పెట్టారు. ప్రస్తుతం భూరక్ష పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న భూముల రీసర్వే దిగ్విజయంగా జరుగుతున్న విషయం తెలిసిందే.

ఏ గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు

దుగ్గిరాల మండలం చింతలపూడి, శృంగారపురం, డీపీ అగ్రహారం, ప్రత్తిపాడు మండలం కొండజాగర్లమూడిలో డ్రోన్ సాయంతో గ్రామకంఠాల సర్వే పూర్తయింది. ప్రస్తుతం మేడికొండూరు మండలంలోని కొర్రపాడు, మంగళగిరిపాడు, పాలడుగు, జంగంగుంట్లపాలెం, వెలవర్తిపాడు, విశదల, వరగాని, పెదనందిపాడు మండలంలోని కాట్రపాడు, పెదనందిపాడు, పాలపర్రు, పుసులూరు, రావిపాడు, వరగాని, రాజుపాలెం, అన్నవరం, ఉప్పలపాడు, ప్రత్తిపాడు మండలంలోని గనికపూడి, ఈదులపాలెం, వంగిపురం, తిమ్మాపురం, మేడవారిపాలెం, వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు, చమల్లపూడి, కారంపూడిపాడు, లేమల్లెపాడు, కోవెలమూడి, కుర్నూతల, ముట్లూరు, పల్లపాడు, యామర్రు, కాట్రపాడులో సర్వే జరుగుతోంది. రెండో దశలో 22,975 కుటుంబాలకు లబ్ధి జరుగుతుందని అంచనా. మొత్తం జిల్లా వ్యాప్తంగా వచ్చే మార్చి నాటికి గ్రామకంఠాల సర్వే పూర్తి చేయాల్సి ఉంది. ఈ సర్వే పూర్తి అయితే దాదాపు లక్షకు పైగా కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని ఒక అంచనా.

క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు

ప్రభుత్వం జారీ చేసే భూహక్కు పత్రంతో లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకోవచ్చు. క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. పూర్తి హద్దులు, విస్తీర్ణం వివరాలతో ధ్రువపత్రాలు పకడ్బందీగా జారీ చేయనుండడంతో భూములపై ఉన్న సివిల్ దావాలు, వివాదాలు తొలగిపోతాయి. అక్టోబర్ రెండున గాంధీ జయంతి నాటికి అప్పటి వరకూ సర్వే పూర్తయిన భూములకు హక్కుపత్రాలు ఇవ్వడానికి రంగం సిద్ధమవుతోంది.

ఇదొక విప్లవమే



గ్రామ కంఠం భూములను రీ సర్వే చేసి పట్టాలు అందించడమంటే ఇది ఒక విప్లవమే. ఎన్నో వివాదాలు, తగాదాలు సమసిపోతాయి. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామాల్లో పర్యటించినప్పుడు స్థానికుల నుంచి చక్కని సహకారమందింది. రానున్న కాలంలో జిల్లా మొత్తం ఉన్న గ్రామ కంఠం భూముల సర్వేను విజయవంతంగా పూర్తి చేస్తాం.

– కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, గుంటూరు

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



గాలి గోపురం వద్ద క్యూలైన్లలో భక్తుల రద్దీ

- ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం
- ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ

విజయవాడ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడగా, ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఉదయం ఎనిమిదింటికి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, చండీ హోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనతోపాటు లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ జరిపించిన సూర్యోపాసన సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. వివిధ సేవల్లో పాల్గొన్న ఉభయ దాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మహామండపం, ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 టికెట్ కొనుగోలు చేసి ఆయా క్యూలైన్ మార్గాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ ఉభయదాతలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అన్నదానాన్ని పర్యవేక్షించిన చైర్మన్

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిత్యం జరుగుతున్న అన్నదానాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు పర్యవేక్షించారు. ఆదివారం ఎంత మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతోంది, భక్తులకు పంపిణీ చేసే ఆహార పదార్థాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులందరికీ అన్న ప్రసాదం పంపిణీ జరిగేలా చూడాలని సెక్షన్ అధికారులను ఆదేశించారు. అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో మాట్లాడి వంటకాల రుచి, నాణ్యత గురించి ఆరాతీశారు. అనంతరం భక్తులకు చైర్మన్ స్వయంగా అన్న ప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం మహామండపం రెండు, మూడు అంతస్తుల్లో క్యూలైన్లు, ఇతర పరిసరాలను పరిశీలించారు. శానిటేషన్‌ను పరిశీలించి ఆయా ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.



శ్రీచక్రనవార్చనలో భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

నేడు దుర్గగుడి ట్రస్ట్ బోర్డు సమావేశం

విజయవాడ : శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం జరగనుంది. బ్రాహ్మణవీధిలోని దేవస్థాన పరిపాలనా భవనంలో ఉన్న పాలక మండలి బోర్డు మీటింగ్ హాల్‌లో ఈ సమావేశం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులతోపాటు ఈఓ భ్రమరాంబ పాల్గొంటారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై చర్చిస్తారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఈహెచ్‌ఎస్ సేవలు

- దీర్ఘకాలిక వ్యాధుల విభాగమూ ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి



వైద్యశాలలోని మొదటి ఫ్లోర్‌లో ఈహెచ్‌ఎస్, క్రానిక్ డిసీజెస్ కోసం ఏర్పాటు చేసిన చాంబర్

నరసరావుపేట: ఇప్పటివరకు గుర్తింపు పొందిన ప్రైవేటు వైద్యశాలలకే పరిమితమైన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) సేవలు ఇక నుంచి స్థానిక డాక్టర్ వైఎస్సార్ జిల్లా ప్రభుత్వ వైద్యశాలలోనూ లభించనున్నాయి. దీని కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈహెచ్‌ఎస్, దీర్ఘకాలిక వ్యాధులు(క్రానిక్ డిసీజెస్) విభాగాలను ఏర్పాటుచేసి రోజుకొక ప్రత్యేకమైన డాక్టర్ సాయంతో వైద్యసేవలు అందించనున్నారు. ఈ విభాగాలను సోమవారం కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు.

ఆస్పత్రిలో అత్యాధునిక వసతులు

లింగంగుంట్ల కాలనీలో కలెక్టరేట్‌కు సమీపంలో సుమారు రూ.15 కోట్ల కేంద్ర ప్రభుత్వ నాబార్డు నిధులతో నిర్మించిన 200 పడకల వైద్యశాలలో రూ.5 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అత్యాధునిక వసతులు కల్పించారు. కరోనా సమయంలో ఈ ఆస్పత్రి అందించిన సేవలు అజరామరం. పల్నాడుతోపాటు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఎంతో మందికి ఈ ఆస్పత్రి సేవలందిస్తోంది.

20 లక్షల మందికి ప్రయోజనం

ప్రస్తుతం ఈహెచ్‌ఎస్, క్రానిక్ డిసీజెస్ విభాగాల ఏర్పాటు ద్వారా జిల్లాలోని 20 లక్షల మంది జనాభాతోపాటుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రయోజనం పొందనున్నారు. ఈహెచ్‌ఎస్ సేవల కోసం ఉద్యోగులు ముందుగా ఓపీలో తమ పేరును రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.

సులువుగా వైద్యసేవలు పొందొచ్చు



ప్రభుత్వ ఉద్యోగులు చాలా సులువుగా మెరుగైన వైద్యసేవలు పొందొచ్చు. కార్డులు ఉన్న ఉద్యోగులు రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పల్నాడు జిల్లాకు చెందిన వారే కాకుండా ఎక్కడివారైనా సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలతో సహా అన్నిరకాల సేవలూ పొందవచ్చు.

– డాక్టర్ బీవీ రంగారావు, వైద్యశాల సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్యశాలల జిల్లా పర్యవేక్షణాధికారి

రోజుకో నిపుణుని సేవలు

దీర్ఘకాలిక రోగాల విభాగంలో మొత్తం 23రకాల రుగ్మతలకు సేవలు అందనున్నాయి. వారంలో ఆరురోజుల పాటు రోజుకొక నిపుణుడైన డాక్టర్ వైద్యసేవలు అందించనున్నారు. సోమవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మంగళవారం జనరల్ మెడిసిన్, బుధవారం గుండె, కిడ్నీ, గురువారం ఎముకలు, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, శుక్రవారం చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, శనివారం పిల్లల, జనరల్ మెడిసిన్ నిపుణులు సేవలు అందిస్తారు.

విమానంలో వచ్చి.. చీరలు చోరీచేసి

బెంగళూరులో ముగ్గురు మహిళల అరెస్ట్



పట్టుబడిన మహిళలు

బనశంకరి (బెంగళూరు): విమానంలో వచ్చి బెంగళూరులో దిగుతారు. వస్త్ర దుకాణాల్లో షాపింగ్ పేరుతో ఖరీదైన చీరలను చోరీ చేసి వచ్చిన దారినే వెళతారు. ఇటువంటి ఖతర్నాక్ 'లేడీ' ముఠాను ఆదివారం అశోకనగర పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితులు గుంటూరు జిల్లాకు చెందిన రమణి, రత్నాలు, చుక్కమ్మ. వీరు ఏపీ నుంచి విమానంలో బెంగళూరుకు వచ్చి స్కార్పియో కారులో బెంగళూరులో సంచరించేవారు. చీరల దుకాణాల్లో కొనుగోలు చేసే నెపంతో సిబ్బంది కళ్లుగప్పి విలువైన చీరలను మాయం చేయడంలో ఆరితేరినవారని పోలీసులు తెలిపారు. శ్రీమంతుల తరహాలో ఒంటినిండా బంగారు నగలు ధరించి షాపులకు వెళ్లి లక్షల విలువైన చీరలను చూపించాలని సిబ్బందిని అడిగేవారు. మరిన్ని చీరలను చూపించాలని కోరేవారు. చీరలను తేవడానికి సిబ్బంది షాపు లోపల స్టోర్‌రూమ్‌లోకి వెళ్లిన సమయంలో వీరు చీరల బండిల్స్‌ను దాచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయేవారు. ఇటీవల ఇలా వెళ్తున్న ఓ మహిళ కాలి వద్ద చీర ఉన్నట్లు షాపు సెక్యూరిటీ గమనించి యజమానికి తెలిపాడు. తరువాత సీసీ కెమెరాలు పరిశీలించగా అసలు బాగోతం బయటపడింది. పుటేజీలతో సహా అశోకనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అశోకనగర పోలీసులు నిందితులను అరెస్ట్‌చేసి వీరి వద్ద నుంచి రూ.14 లక్షల విలువ చేసే చీరలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

ఫిలిం ఫెస్టివల్‌లో స్టాల్స్‌కు దరఖాస్తు చేసుకోండి

బాపట్ల: అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ గోవాలో జరగనున్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకటన మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 నవంబర్ 20 నుంచి 28వ తేదీ వరకు గోవాలో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో రాష్ట్రం తరఫున ప్రత్యేక ప్రదర్శన స్టాల్ ఏర్పాటు కోసం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ఆసక్తిగలవారు ఏపీ ఎస్ఎఫ్‌టీవీటీడీసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఇతర సమాచారం కోసం సెల్ నంబర్లు 92050 07369, 92059 70036లను సంప్రదించాలని ఆయన కోరారు.

డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేకు గోల్డ్‌మెడల్



డాక్టర్ గోఖలేకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తున్న తెనాలి వైద్యులు

తెనాలిరూరల్: ప్రముఖ గుండె వైద్య నిపుణులు, కార్డియో థొరాసిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు బంగారు పతకం ప్రదానం చేశారు. పట్టణ బోస్ రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గోఖలేకు ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. 'మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ' అన్న అంశంపై డాక్టర్ గోఖలే ప్రసంగించారు. తెనాలి వైద్యులకు గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు, అధునాతన వైద్య సేవలు, సదుపాయాల గురించి వివరించారు. మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ పద్ధతి ద్వారా సాధారణ ఓపెన్ హార్ట్ సర్జరీ విధానంలా కాకుండ చిన్న చిన్న కోతలతో రోగి గుండెకు శస్త్ర చికిత్సలు చేసే విధానం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గుండెలోని రంధ్రాలను పూడ్చడం, వాల్వ్‌లను రిపేరు చేయడం, మార్చడం, కణితలను తొలగించడం వంటి శస్త్ర చికిత్సలను చేయవచ్చని వివరించారు. ఈ విధానంలో శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులు త్వరగా కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేకు డాక్టర్ పి.దక్షిణామూర్తి ధార్మిక బంగారు పతకం ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ జి.వెంకటరెడ్డి, డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్, డాక్టర్ జి.నరసింహారావు, డాక్టర్ విశ్వమోహన్‌రావు, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ జె.భానుప్రసాద్, డాక్టర్ ఎంవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో తెనాలి యువతి సత్తా



డెడ్ లిఫ్ట్‌లో మూడో స్థానం సాధించిన షేక్ షబీనా

తెనాలి: రొమేనియాలో జరుగుతున్న వరల్డ్ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో తెనాలి లిఫ్టర్ షేక్ షబీనా సత్తా చాటింది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక లిఫ్టర్‌గా రొమేనియా వెళ్లిన షబీనా, భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి పొద్దుపోయాక జరిగిన సబ్‌జూనియర్స్ 84 కిలోల విభాగంలో ప్రతిభ చూపింది. స్క్వాట్‌లో 175 కిలోల బరువులనెత్తి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. బెంచ్‌ప్రెస్‌లో 77 కిలోలతో నాలుగోస్థానంలో నిలిచింది. డెడ్‌లిఫ్ట్‌లో 150 కిలోల బరువునెత్తి మూడో స్థానంలో నిలిచింది. అన్నివిభాగాల్లోనూ కలిపి ఓవరాల్‌గా 402 కిలోల బరువులనెత్తి కాంస్య పతకాన్ని గెలిచింది. పవర్ లిఫ్టింగ్‌పై ఆసక్తితో తల్లిని వెంటబెట్టుకుని రోజూ మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌కు వెళ్లి అంతర్జాతీయ లిఫ్టర్ షేక్ సంధాని శిక్షణలో షబీనా సాధన చేస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలు సాధించటమే కాకుండా గత మే నెలలో కేరళలో జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు స్వర్ణపతకాలు, ఒక రజత పతకాన్ని షబీనా సాధించిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు ప్రపంచస్థాయి పోటీల్లోనూ చక్కని ప్రదర్శనతో కాంస్యం దక్కించుకుని విజయబావుటాను ఎగురవేసింది. సౌతిండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేషన్ సభ్యులు కొమ్మకుల విజయభాస్కరరావు, బి.ప్రసాద్ అభినందించారు.

శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ అర్చక సంఘం ఎన్నిక ఏకగ్రీవం

విజయవాడ : శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ అర్చక సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. విజయవాడ మాచవరంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. దీంతో అధ్యక్షులుగా యణమండ్ర సత్య సీతారామశర్మ (మురమళ్ల రాంబాబు) కోనసీమ జిల్లా, ప్రధాన కార్యదర్శిగా పత్రి అనిల్‌కుమార్ (పల్నాడు జిల్లా), కోశాధికారిగా మురికిపూడి కృష్ణ కిషోర్ (ప్రకాశం జిల్లా) ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారిగా ఎస్. విశ్వేశ్వరావు వ్యవహరించారు. సత్యసీతారామశర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక అర్చకులు కలిగిన శ్రీఆంధ్ర రాష్ట్రీయ ఆది శైవ అర్చక సంఘం ఎన్నికలు ఏకగ్రీవం కావటం ఆనందంగా ఉందన్నారు. అర్చకుల సంక్షేమానికి, ఆది శైవుల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

ఉత్తమ డిజిటల్ మార్కెటింగ్ అవార్డు సొంతం చేసుకున్న అశోక్‌రెడ్డి



సత్తెనపల్లి: ఉత్తమ డిజిటల్ మార్కెటింగ్ అవార్డును పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన అశోక్ రెడ్డి సొంతం చేసుకున్నాడు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. బీటెక్ పూర్తి చేసి బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని అణువణువు వంటపట్టించుకుని ఒక లక్ష్యంతో 2018లో డిజిటల్ డ్రాప్స్‌ను స్థాపించాడు. అప్పటి వరకు డిజిటల్ అడ్వర్‌టైజ్ రంగంలో సరైన ప్లాట్‌ఫారం లేని తరుణంలో ఒక చక్కని బాట వేసి వ్యాపార, సంస్థల పురోభివృద్ధికి చక్కని అవకాశాన్ని కల్పించి సంస్థలకు, మార్కెటింగ్‌కు మధ్య వారధిగా నిలిపారు. డిజిటల్ డ్రాప్స్ నీ, మార్కెటింగ్‌కి కస్టమర్ చేరే వరకు కూడా అన్ని స్టెప్స్‌లోనూ విజయం సాధించి మార్కెటింగ్ రంగంలో డిజిటల్ డ్రాప్స్ అంటే అభివృద్ధి, నమ్మకం, విజయం అనే నిజమైన భావాన్ని సొంతం చేసుకోవడంతో అవార్డు వరించినట్లు అశోక్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

రూ.4.50 లక్షలు దోచుకున్న సైబర్ నేరగాళ్లు

మాచవరం: సైబర్ నేరగాళ్ల మోసాలకు మహిళ మోసపోయిన ఘటన మాచవరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాచవరానికి చెందిన కొర్రపాటి రాజేశ్వరికి తుళ్లూరు మండలం కొర్రపాటివారిపాలేనికి చెందిన వ్యక్తితో సుమారు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా యూకే(లండన్)లో నివాసం ఉంటున్నారు. ఇటీవల రాజేశ్వరి తల్లిదండ్రుల వద్దకు మాచవరం వచ్చింది. ఈనెల 12న షిరిడి వెళ్లేందుకు రైల్వే టికెట్ ఆన్‌లైన్‌లో బుక్ చేసింది. టికెట్స్ బుక్ కాకుండానే బ్యాంక్ ఖాతాలోని నగదు డ్రా అయ్యాయి. రీఫండ్ కోసం ఆన్‌లైన్ పరిశీలించగా ఓ ఫోన్ నంబర్ నుంచి బ్యాంక్ వివరాల నమోదు చేయాలని మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె బ్యాంక్ వివరాలు ఆ ఫోన్ నంబర్‌కు తెలియజేసింది. వెంటనే గుంటూరులోని తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.4.50 లక్షలు నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన మహిళ ఆదివారం మాచవరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగావకాశాలు

- ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం
- జిల్లా ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందని ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పల్నాడు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జూనియర్ బాల, బాలికలు, సీనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది బాలురు, 50 మంది బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి క్రీడా కారుడు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీరామ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెరిట్ సర్టిఫికెట్ సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా జూనియర్స్ బాల, బాలికలు, సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ జట్లను ఎంపిక చేశారు.



ఎంపికైన ఫుట్‌బాల్ జిల్లా బాల, బాలికల జూనియర్, సీనియర్ జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

జూనియర్స్ బాలుర విభాగంలో.. జి ప్రదీప్, అంకమ్మరావు, ఎస్‌కే రాజు, ఎస్కే సోహిల్, దీపక్, ఇర్ఫాన్, వెంకటేష్, మణికంఠ, గిరి ప్రతాప్, ఆశిష్, సన్నీ, మహమ్మద్ ఇర్ఫాన్, శివమణి, శామ్యూల్, మహమ్మద్ అఫీజ్, సాంబశివరావు, శ్రీనివాసరావు, సాయి గణేష్, జస్వంత్, నితీష్.

సీనియర్ బాలుర విభాగంలో.. అంకమ్మరావు, చందు, ఇర్ఫాన్, సాకేత్, శ్రీనివాసరావు, ప్రసన్న, సాగర్ మహేష్, వెంకటేష్, అజయ్, శివశంకర్, కల్యాణ్ రామ్, ఆకాష్, జస్వంత్, రాజు, వీరాంజనేయులు, శ్యాము, ప్రవీణ్ కుమార్, వెంకట సాయి, జయరాం, నరేష్.

జూనియర్స్ బాలికల విభాగంలో.. మౌనిక, ఈశ్వరి, మంజుల, హర్షిని, ప్రసన్న, త్రివేణి, ప్రత్యూష, రోహిణి, శ్వేత, విజయలక్ష్మి, సంధ్య, కావ్య, ప్రసన్న, దివ్య. **సీనియర్స్ బాలికల విభాగంలో..** మహేశ్వరి, దివ్య, అశ్విని, సరియు, శ్రావ్య, వెంకట ప్రియ, మహేశ్వరి, నవ్య, అమృత, శ్రీలత, నాగ సాయ, చంద్రిక, తేజస్విని, గాయత్రి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఐఎస్ నాగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రియాజ్, అచ్చిరెడ్డి, కమలాకర్, నరసింహా రావు, జాన్ సైదా, నూరుల్లా, సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ డబుల్ ఇంజిన్ పాలన ఓ వైఫల్య సిద్ధాంతం

- అందుకు మణిపూర్ ఘటనలే నిదర్శనం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పాత గుంటూరు: దేశంలో లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా.. ఏక వ్యక్తి పరిపాలన తెచ్చేందుకు బీజేపీ రచిస్తున్న డబుల్ ఇంజిన్ సిద్ధాంతం ఒక వైఫల్య సిద్ధాంతమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ఘటనలే అందుకు నిదర్శనమని తెలిపారు. కేంద్రంలోనూ, మణిపూర్ రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ అక్కడ జరుగుతున్న మారణహోమాన్ని నిలువరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం గుంటూరు చేరింది. వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్ అధ్యక్షత వహించారు. నారాయణ మాట్లాడుతూ మణిపూర్‌లో మోదీ అగ్గి అయితే... ఆజ్యం అమిత్ షా అంటూ ఘాటుగా విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



సభలో మాట్లాడుతున్న నారాయణ

కె.రామకృష్ణ మాట్లాడుతూ మోదీ తన మత ప్రచారానికి చంద్రమండలాన్ని కూడా వదల్లేదని, చంద్రయాన్–3 దిగిన ప్రదేశాన్ని శివశక్తిగా నామకరణం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు, నగర కమిటీ సభ్యులు, విద్యార్థి, యువజన, రైతు, కార్మిక సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా సాధన విద్యార్థి యువజన ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ జిలాని ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకి ప్రత్యేక హోదా సాధనపై వినతిపత్రం అందించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆటో.. కారు ఢీకొని 13 మందికి గాయాలు

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం సమీపంలో అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో 13 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు సుబ్బయ్యపాలెం సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళ్తున్న ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఆటో, కారు హైవే పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీకొట్టాయి. ఆటోలో, కారులో ప్రయాణిస్తున్న 13 మందికి గాయాలవ్వటంతో హైవే అంబులెన్స్‌తో పాటు మూడు 108 వాహనాల్లో గాయాలైన వారందరినీ నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ సురేష్ బాబు పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

6న కిసాన్ బజార్ ప్రారంభం

తెనాలి: రూరల్ మండలం నందివెలుగులో స్వచ్ఛ ఆహార ఉత్పత్తిదారుల సంఘం నూతన కలెక్షన్ సెంటర్, కిసాన్ బజార్‌ను సెప్టెంబరు ఆరో తేదీన ప్రారంభించనున్నారు. గుంటూరు రోడ్డులో నందివెలుగు వంతెన వద్ద ఏర్పాటయ్యే ఈ కేంద్రాన్ని ఆరోజు ఉదయం 10 గంటలకు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఆంధ్రప్రదేశ్ రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్, సీఈఓ బి.రామారావు, నాబార్డు డీడీఎం జి.శరత్‌బాబు, జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుజాత, తెనాలి ఏడీఏ ఎస్.ఉషారాణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు కె.రాజకుమారి పాల్గొంటారని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయకీలాద్రిపై వరాహ జయంతి ఉత్సవాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వరాహ జయంతి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో భూవరాహ హోమం, అర్చన, పూర్ణాహుతి, చాతుర్మాస్యదీక్షలో భాగంగా శ్రీయాగం, సీతారాముల శాంతి కల్యాణ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

తెలుగుభాష గొప్పతనం భావితరాలకు అందించాలి

జిల్లాస్థాయి కవి సమ్మేళనంలో వక్తలు

ఫిరంగిపురం: తెలుగు భాషా గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ రఫీ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ పాఠశాల ఆడిటోరియంలో ఆదివారం కొండవీడు రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగుభాష గొప్పతనం, గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి కవిసమ్మేళనం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన కవులు, రచయితలు తెలుగుభాష గొప్పతనాన్ని తమ రచనలు, కవితల ద్వారా వివరించారు. తెలుగును వెలిగిద్దాం, తెలుగులో బతికిద్దాం అనే అంశంమీద పలువురు మాట్లాడారు. నన్నయ, తిక్కన, ఎర్రా ప్రగడ వంటి మహాకవులు తెలుగు భాష అభివృద్ధికి చేసిన రచనలు గురించి వివరించారు. తెలుగు భాష



కవులను సన్మానిస్తున్న కొండవీడు రచయితల సంఘం సభ్యులు

గొప్పతనాన్ని గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా మాట్లాడే విధంగా గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషిని తెలియజేశారు. ఆయన జయంతిని తెలుగు భాష దినోత్సవంగా నిర్వహించుకోవడం తెలుగువారి గొప్పతనమని చెప్పారు. అనంతరం కొండవీడు పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.శివారెడ్డిని పలువురు రచయితలు, కవులను ప్రశంసాపత్రం, షీల్డు, శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం ప్రధానకార్యదర్శి టి.గోవిందయ్య, సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్యం పుట్టిన గడ్డ అద్దంకి

అద్దంకి: పద్యం పుట్టిన గడ్డ అద్దంకి అని మాజీ ఉప సభాపతి, ప్రపంచ తెలుగు మహాసభల గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సృజన సాహిత్య సంఘం 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు ముందుగా కమలేశ్వరాలయం పక్కనే ఉన్న పండ రంగని పద్య శాసనం, కవిత్రయంలోని ఎర్రన విగ్రహాలకు పూలమాల వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సృజన సంఘం పద్య శాసన ప్రతి కృతిని అద్దంకిలో ప్రతిష్ఠించడం పద్యానికి గొడుగు పట్టడమేనన్నారు. కవి సమ్మేళనంలో షేక్ కరీముల్లాతో పాటు 60 మంది కవులు తమ కవితల్ని వినిపించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నలూరి వెంకట శ్రీనివాసులు, కుందుర్తి స్వరాజ్య పద్మజ, పాలపర్తి జోతిష్మతి, డాక్టర్ యు.దేవపాలన, కె.యస్.వి. ప్రసాద్, వడలి, మూడమంచు వెంకటేశ్వర్లు,



ఎర్రనకు పూలమాలలతో నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

జి.వి. మాల్యాద్రి, ఆర్.వి.రాఘవరావు, ఇల పావులూరి శేషతల్పసాయి నిర్వహించారు.

అరగంట మాట్లాడుకుందాం..

అరగంట మాట్లాడుకుందాం సభలో భాగంగా పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజన సాహితీ వైభవం పుస్తకం గురించి ఆర్.వి. రాఘవరెడ్డి ప్రసంగించారు. ఆయా కార్యక్రమాల్లో వీరవల్లి సుబ్బారావు, జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, అనల కుమారసూరి, సంకా బాబు, జి.వి. పూర్ణచందు, గాడేపల్లి దివాకరదత్తు, కవులు, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

గోవా మద్యం స్వాధీనం

కారంచేడు: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తుల ఆట కట్టించారు పోలీసులు. ఆదివారం వేకువజామున అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని కారంచేడు ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలసి చేజ్ చేసి పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గోవా (వాస్కోడిగామ) నుంచి 140 బ్రాందీ ఫుల్ బాటిల్స్ బ్యాగ్‌లలో సర్దుకొని కొందరు విజయవాడ వరకు ట్రైన్‌లో వచ్చారు. అక్కడ నుంచి కారులో చీరాలకు ఈ మద్యాన్ని చీరాల రాంనగర్‌కు చెందిన రాగాల ప్రియాంక తరలిస్తోంది. కారంచేడు కాలువ సెంటర్‌లో కాపు కాసిన ఎస్‌ఐను గమనించిన కారు వెనక్కు తిరిగి కుంకలమర్రు వైపు దూసుకు వెళ్లింది. విషయాన్ని గమనించిన పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. కారులో డ్రైవర్‌తో పాటు ప్రియాంకను కూడా అరెస్టు చేశారు. మద్యాన్ని, కార్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ కారంచేడు వచ్చి ఎస్‌ఐ శ్రీనివాసరావు అభినందించారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. లింగంగుంట్ల కాలనీలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆదివారం జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ప్రశ్నించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. అనంతరం 9,10 తరగతి విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు.



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పదో తరగతి విద్యార్థులకు భౌతికశాస్త్రంలోని ఉష్ణం పాఠ్యాంశాన్ని బోధించారు.

లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ సంఘం అధ్యక్షుడిగా కమలాకరరెడ్డి

నరసరావుపేట: లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ సంక్షేమ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నరసరావుపేటకు చెందిన కొమ్మసాని కమలాకరరెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం రాష్ట్ర ఇంజినీర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షులు చేపూరు శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని లిటిల్ విలేజ్ రెస్టారెంట్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశంలో 2023–2025కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కంభం సాయిబాబు, జనరల్ సెక్రటరీగా రేజేటి సతీష్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా ఎస్‌వీ సుబ్బారాయుడు, కోశాధికారిగా ఎం.వందనకుమార్‌లను ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా అబ్దుల్ రహీమ్, గౌరవ సలహాదారులుగా వి.మైనర్‌బాబు, ఎం.వందనకుమార్, ఉపాధ్యక్షులుగా మారెళ్ల రామాంజనేయులు, మహ్మద్ ఉమర్ షరీఫ్, బి.వెంకటనారాయణ, వి.విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ కరీముల్లా, మీసా శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, షేక్ అలీ, జాయింట్ ట్రెజరర్స్ గమిని శ్రీదేవి, డి.కిరణ్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా లియాఖత్ అలీఖాన్, షేక్ మురాద్ అలీ, డి.వి.కృష్ణారావు,



అధ్యక్షునిగా ఎన్నికైన కమలాకరరెడ్డిని సన్మానిస్తున్న మిగతా కార్యవర్గ సభ్యులు

సయ్యద్ ఫిరోజ్, ఎ.సూర్య కుమార్, ఎ.చైతన్య కమేష్ యాదవ్, గూడూరు సుమతి, కృపాగంగాధర్‌రెడ్డి, అబ్దుల్ కరీం, బొందిలి శ్రీనివాససింగ్, వి.వేణుగోపాలరావు, తోట చినసాంబశివయ్య, దేవరపల్లి రజని, ఎస్.వెంకటరావు, కందెల అమర్‌లను ఎన్నుకున్నారు. కమలాకరరెడ్డి మాట్లాడుతూ సభ్యుల ఉన్నతి కోసం గతంలో ఎలా పని చేసామో ఇప్పుడు అంతకన్నా రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామన్నారు. సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పనిచేస్తామని చెప్పారు.

రైతు సంక్షేమానికే ప్రకృతి వ్యవసాయం

నరసరావుపేట రూరల్: రైతు సంక్షేమానికి ప్రకృతి వ్యవసాయ విధానం దోహదపడుతోందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కే అమలకుమారి పేర్కొన్నారు. రైతు సాధికారక సంస్థ ఆధ్వర్యంలో ఇండో– జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న రైతు శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించేందుకు ప్రకృతి వ్యవసాయం ఉపకరిస్తుందని తెలిపారు. వ్యవసాయ భూములను నాశనం చేసే మితిమీరిన రసాయనాలను వాడరాదని కోరారు. జనాభా పెరుగుదల వలన రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భూమి విస్తీర్ణం తగ్గిందని చెప్పారు. సన్నకారు రైతులకు హెక్టారు కంటే తక్కువగా భూమి ఉందని



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం కె.అమలకుమారి

తెలిపారు. రైతులు వారి భూముల్లో ఎలాంటి రసాయనాలు ఉపయోగించుకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలను సాగుచేసేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందని పేర్కొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేద్దాం

అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బాలునాయక్

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధి కోసం అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం కృషి చేస్తుందని అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మండపంలో అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న గిరిజనుల అభివృద్ధి కోసం తమ ఉద్యోగ సంఘం పని చేస్తుందిని చెప్పారు. అందుకు సంఘంలోని సభ్యులంతా ఎనలేని కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన



మాట్లాడుతున్న అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్

వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. గిరిజనులంతా ఐక్యంగా ఉంటేనే మన హక్కులను సాధించుకోవచ్చునని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పాటుపడాలి

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- ముఖ్యమంత్రి జగనన్న ఆశయ సిద్ధికి కృషి చేయాలి
- ఘనంగా కూచినపూడి మార్కెట్ యార్డు ప్రమాణ స్వీకారోత్సవం

నిజాంపట్నం (రేపల్లె): ముఖ్యమంత్రి జగనన్న ఆశయ సిద్ధికి పని చేస్తూ, రైతుల అభ్యున్నతికి పాటు పడాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. మండలంలోని కూచినపూడి మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు అందిస్తున్న సేవలను వారికి తెలియజేయాలని, వివరాలను కూడా బోర్డులో నమోదు చేసి ఉంచాలని సూచించారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వ్యవసాయమే దండగంటూ చంద్రబాబు నాయుడు నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా నేడు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేశారని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ఆర్థికంగా రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నారని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఎరువులు, విత్తనాలు, యంత్రాలు అందిస్తున్నారని చెప్పారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇది చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడని తెలిపారు. ఆయనతో తనకు పాతిక సంవత్సరాల అనుబంధం ఉందని, మాటలు తప్పా ఎక్కడా పనులేమీ కావని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి రైతుల్ని అన్ని విధాలా ఆదుకుంటున్నారని,



నూతన పాలకవర్గ సభ్యులతో ఎంపీలు మోపిదేవి, బీద మస్తాన్‌రావు

వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా పంటకు గిట్టుబాటు ధరను అందిస్తున్నారని వివరించారు. రైతు మేలుకోరే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు.

కులమత బేధాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే చేరాలనేది వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నినాదమని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన మార్కెట్ యార్డు పాలక మండలి రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూర్చేలా పని చేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలబడి, మరోమారు ముఖ్యమంత్రిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య, నాయకులు ప్రసాదం వాసుదేవా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గ సభ్యులు వీరే...

యార్డు చైర్మన్‌గా పందరబోయిన బసవ పున్నయ్య, వైస్ చైర్మన్‌గా కొలసాని కోటేశ్వరరావు, డైరెక్టర్లతో అగ్రికల్చరల్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు.